సాక్షి నాగర్‌కర్నూల్

సోమవారం । 11 । ఆగస్టు । 2025



పాలమూరుకు సాగునీరు

మహబూబ్‌నగర్ ప్రజలకు తాగునీరు అందించిన కోయిల్‌సాగర్ ప్రాజెక్టు.. ఇప్పుడు సాగునీటిని అందించబోతోంది.

-8లో ▸



చిక్కని చిరుత

పాలమూరు పట్టణ సమీపంలోని అడవుల్లో చిక్కకుండా తిరుగుతున్న చిరుత స్థానికులను భయాందోళనకు గురిచేస్తోంది.

-8లో ▸

గరిష్టం/కనిష్టం
35.4 /21.0

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు మంత్రుల పర్యటన

నాగర్‌కర్నూల్/అచ్చంపేట/బల్మూర్: అచ్చంపేట నియోజకవర్గంలో సోమవారం రాష్ట్ర కార్మిక, గనులశాఖ మంత్రి డా.వివేక్ వెంకటస్వామి పర్యటించనున్నారు. అచ్చంపేటలో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ. 3కోట్లతో నిర్మించిన మున్సిపల్ భవనాన్ని ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి ఆయన ప్రారంభించనున్నారు. అదే విధంగా బల్మూర్ మండలం రామాజీపల్లి నుంచి కొండనాగుల వరకు పీఆర్ నిధులు రూ.3కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు, కొండనాగులలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ. 1.50లక్షలతో సీసీరోడ్డు, డ్రైయినేజీ నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం కొండనాగులలో రూ. 20లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించడంతో పాటు అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. మంత్రి పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కాగా, మంత్రి పర్యటన ఏర్పాట్లను ఆదివారం ఎమ్మెల్యే వంశీకృష్ణ పరిశీలించారు.

దరఖాస్తు చేసుకోండి

కందనూలు: జిల్లాలోని వ్యవసాయదారులు 2025 పాలసీ సంవత్సరానికి గాను రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని డీఏఓ యశ్వంత్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 1966 ఆగస్టు 14నుంచి 2007 ఆగస్టు 14వ తేదీ మధ్య జన్మించిన రైతులు అర్హులని పేర్కొన్నారు. గత జూన్ 5వ తేదీ వరకు కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకం వచ్చిన రైతులు, ఇంతవరకు రైతుబీమా చేసుకోని రైతులు మాత్రమే 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

భారీ వర్షం



కందనూలు: జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. జిల్లా కేంద్రంలో దాదాపు గంట పాటు కురిసిన వర్షంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. అంబేడ్కర్ చౌరస్తా, శ్రీపురం రోడ్డు, నల్లవెల్లి రోడ్డు, పాత బస్టాండ్ పరిసరాల్లోకి భారీగా వర్షపునీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాహనదారులు, ప్రజలు అవస్థలు పడ్డారు. జిల్లా కేంద్రంలో 45.8 మి.మీ., బల్మూరులో 22.8, బిజినేపల్లిలో 22.5, ఉప్పునుంతలలో 20.5, ఊర్కొండలో 18.3, అచ్చంపేటలో 14.3, తిమ్మాజిపేటలో 13.8, చారకొండలో 13.5, వెల్దండలో 11.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.

కేఎల్ఐ.. రికార్డు బ్రేక్!

ఈ ఏడాది ఇప్పటికే 4 టీఎంసీలు పంపింగ్



కేఎల్ఐ ఎత్తిపోతల పథకం

- గత సీజన్‌లో 50 టీఎంసీల నీటి ఎత్తిపోతలు
- మూడు మోటార్లతోనే కొనసాగుతున్న లిఫ్టింగ్
- భారం పడుతున్నా.. తప్పడం లేదంటున్న అధికారులు

కొల్లాపూర్: జిల్లా వరప్రదాయిని కేఎల్ఐ ప్రాజెక్టు నీటి ఎత్తిపోతల్లో రికార్డు సృష్టిస్తోంది. కృష్ణానదికి వరద ప్రారంభమైన కొన్ని రోజుల్లోనే 4 టీఎంసీల నీటిని ఎత్తిపోసి గత రికార్డుకు బ్రేక్ వేసింది. 2011లో కేఎల్ఐ ద్వారా ఎత్తిపోతలు ప్రారంభం కాగా.. నాటి నుంచి అవిశ్రాంతంగా మోటార్లు పనిచేస్తున్నాయి. కొన్నేళ్ల క్రితం ప్రాజెక్టు మొదటి పంపుహౌజ్‌లో రెండు మోటార్లు పాడయ్యాయి. మిగిలిన మూడు మోటార్లతోనే నీటిని ఎత్తిపోస్తూ ప్రాజెక్టు అధికారులు రికార్డు సృష్టిస్తున్నారు.

పనితీరు ఇలా..

కేఎల్ఐ పరిధిలో ఎల్లూరు, జొన్నలబొగుడ, గుడిపల్లి గట్టు పంప్‌హౌజ్‌లు ఉన్నాయి. ఒక్కో పంపుహౌజ్‌లో 5 మోటార్ల చొప్పున ఏర్పాటుచేశారు. వీటిలో 4 మోటార్లు రెగ్యులర్ పంపింగ్ కోసం, ఒక మోటార్ స్పేర్‌లో ఉంచేందుకు నిర్ణయించారు. 30 మెగావాట్ల సామర్థ్యం గల ఒక్కో మోటార్ ద్వారా రోజూ 800 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తారు. కేఎల్ఐ ద్వారా కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గాల్లోని ఆయకట్టు భూములకు సాగునీరు అందుతోంది.

మిషన్ భగీరథకు సైతం..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు రంగారెడ్డి జిల్లాలోని పలు మండలాలకు తాగునీరు అందించేందుకు ఏర్పాటుచేసిన మిషన్ భగీరథ పథకానికి కూడా కేఎల్ఐ ద్వారానే నీటి ఎత్తిపోతలు సాగుతున్నాయి. ఎల్లూరు సమీపంలోనే మిషన్ భగీరథ స్కీం ఏర్పాటుచేశారు. ఇక్కడి నుంచే అన్ని ప్రాంతాలకు తాగునీరు సరఫరా అవుతోంది. ప్రతి సంవత్సరం మిషన్ భగీరథ కోసం 7 టీఎంసీల నీటిని వినియోగిస్తున్నారు.

రెగ్యులర్‌గా పంపింగ్..

వర్షాకాలంలో మినహాయిస్తే మిగతా రోజుల్లో ఎల్లూరు పంప్‌హౌజ్ లోని మూడు మోటార్ల ద్వారా రెగ్యులర్‌గా నీటిని పంపింగ్ చేస్తు న్నాం. సాగునీటితో పాటు, మిషన్ భగీరథకు కూడా నీటిని ఎత్తిపోస్తున్నాం. దీంతో మోటార్లపై భారం పడుతోంది. అయినా తప్పడం లేదు. పాలమూరు ప్రాజెక్టు ద్వారా ఎత్తిపో తలు ప్రారంభమైతే కేఎల్ఐపై భారం తగ్గు తుంది. ఈ ఏడాది జూన్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 4 టీఎంసీల నీటిని ఎత్తిపోశాం. గతేడాది 50 టీఎంసీల నీటిని ఎత్తిపోశాం.

– లోకిలాల్ నాయక్, డీఈ, పంపుహౌజ్ నిర్వహణ విభాగం

ప్రాజెక్టు ప్రారంభం నుంచి నీటి ఎత్తిపోతలు ఇలా..

సీజన్	ఎత్తిపోసిన నీరు (టీఎంసీల్లో)
2011-12	0.00864
2012-13	1.9062432
2013-14	1.351552
2014-15	1.7842464
2015-16	2.5099632
2016-17	14.01715
2017-18	27.35148
2018-19	35.97796
2019-20	49.99874
2020-21	30.29203
2021-22	31.71288
2022-23	37.50358
2023-24	30.38209
2024-25	50.72208


2025 జూన్ 1నుంచి ఇప్పటి వరకు 4 టీఎంసీలు ఎత్తిపోశారు.

ఇదీ ప్రాజెక్టు చరిత్ర..

కొల్లాపూర్ మండలం ఎల్లూరు సమీపంలోని కోతిగుండు వద్ద నుంచి కృష్ణా బ్యాక్‌వాటర్‌ను వినియోగించుకునేలా కల్వకుర్తి లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మించారు. 1998లో ప్రాజెక్టు నిర్మాణానికి సర్వే చేపట్టారు. 2003లో పనులు ప్రారంభమయ్యాయి. 2.50లక్షల ఎకరాల ఆయకట్టు సాగుకు 25 టీఎంసీల నీటిని ఎత్తిపోసేలా డిజైన్ రూపొందించారు. 2005లో ఆయకట్టు విస్తీర్ణాన్ని 3.40 లక్షలకు పెంచారు. 2011లో ఈ ప్రాజెక్టు ద్వారా నీటి ఎత్తిపోతలు ప్రారంభమయ్యాయి. ఎల్లూరు పంప్‌హౌజ్‌లోని 5 మోటార్ల ద్వారా రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోసి.. అక్కడి నుంచి సింగోటం, జొన్నలబొగుడ, గుడిపల్లి గట్టు రిజర్వాయర్లకు పంపింగ్ చేస్తున్నారు. 2016లో ప్రాజెక్టుకు 40 టీఎంసీల నీటి కేటాయింపులు జరిగాయి. దీంతో ఆయకట్టు విస్తీర్ణాన్ని 4.24 లక్షల ఎకరాలకు పెంచారు.

మోటార్లపై భారం..


ఎల్లూరు పంప్‌హౌజ్‌లో ఐదు మోటార్లకు గాను ప్రస్తుతం మూడు మోటార్లు మాత్రమే పనిచేస్తున్నాయి. 2011లో కేఎల్ఐ ద్వారా నీటి ఎత్తిపోతలు ప్రారంభమైన సమయంలో ఐదు మోటార్ల ద్వారా 0.0086 టీఎంసీ నీటిని మాత్రమే ఎత్తిపోశారు. 2015 వరకు ప్రతి సంవత్సరం 2.5 టీఎంసీల లోపు మాత్రమే ఎత్తిపోతలు జరిగాయి. 2016 నుంచి నీటి పంపింగ్ శాతం భారీగా పెరుగుతూ వచ్చింది. మూడు మోటార్లతోనే రికార్డు స్థాయిలో పంపింగ్ జరుగుతోంది. సాగు, తాగునీటికి కేఎల్ఐ ప్రాజెక్టే దిక్కవడంతో మోటార్లపై పంపింగ్ భారం పెరుగుతోంది. నీటి పంపింగ్ రికార్డుస్థాయిలో జరుగుతోందని ఓవైపు ఆనందపడుతున్న అధికారులు.. మరోవైపు మోటార్లపై భారం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఎల్లూరు పంప్‌హౌజ్ నుంచి నీటి ఎత్తిపోతలు

'నులి'మేద్దాం..

- నేడు జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం
- 1నుంచి 19 ఏళ్లలోపు వారికి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ
- జిల్లాలో 2,03,252 మందికి మాత్రలు వేసేందుకు ప్రణాళిక



అచ్చంపేట: కడుపులో నులిపురుగులతో పిల్లలు అనేక అనారోగ్య సమస్యలతో సతమతమవుతుంటారు. వారి శారీరక, మానసిక ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో నులిపురుగులను నివారించడమే లక్ష్యంగా వైద్యారోగ్యశాఖ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ప్రతి ఏటా ఆగస్టు 11న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం చేపడుతోంది. ఈ మేరకు సోమవారం జిల్లావ్యాప్తంగా 1నుంచి 19 ఏళ్లలోపు వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నారు.

పక్కా ప్రణాళిక..

జిల్లావ్యాప్తంగా 1నుంచి 19ఏళ్లలోపు వారు 2,03,252 మంది ఉన్నారు. వీరిలో 1,131 అంగన్‌వాడీ కేంద్రాల్లో 46,444 మంది చిన్నారులు, 1,147 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ఇతర విద్యాసంస్థల్లో 1,56,808 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసేందుకు పక్కా ప్రణాళిక రూపొందించారు. గతంలో ఏటా ఫిబ్రవరి, ఆగస్టు మాసాల్లో పిల్లలకు మాత్రలు పంపిణీ చేసేవారు. 2020లో కరోనా మహమ్మారి తర్వాత ఆగస్టులో మాత్రమే ఈ కార్యక్రమం చేపడుతున్నారు. ఈ నెల 11న ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లాలో గుర్తించిన పిల్లందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నారు. అనారోగ్యంతో ఉన్న పిల్లలతో పాటు మిగిలిన వారికి ఈ నెల 18న మాత్రలు వేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

తప్పనిసరి వేయించాలి..



జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో 1నుంచి 19ఏళ్లలోపు వారందరికీ తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు వేయించాలి. మాత్రల పంపిణీ కార్యక్రమంలో 861మంది ఆశావర్కర్లు, 299మంది ఏఎన్‌ఎంలు, 81మంది సూపర్‌వైజర్లతో పాటు అంగన్‌వాడీ టీచర్లు, ఇతర సిబ్బందితో కలిపి మొత్తం 1,150 మంది పాల్గొననున్నారు.

– రవినాయక్, డీఎంహెచ్‌ఓ

సమస్యలు.. జాగ్రత్తలు

నులిపురుగులతో బాధపడేవారు ప్రధానంగా ఎనిమియా (రక్తహీనత) వ్యాధి బారినపడతారు. అనారోగ్యంతో నీరసించిపోతారు. శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది. ఆకలి మందగించి జీర్ణ సంబంధ సమస్యలు తలెత్తుతాయి. పిల్లలు మందబుద్ధిగా తయారవుతారు. మలవిసర్జన ప్రదేశంలో, చర్మంపై దురదలు వస్తుంటాయి. కొందరు పిల్లల్లో దీర్ఘకాలం పాటు ఇవి ఉన్నప్పటికీ వ్యాధి లక్షణాలు కనిపించకపోవచ్చు. కానీ, ఈ సమస్య వారి ఆరోగ్యం, విద్య ఇలా అన్ని రకాల ఎదుగుదలపై ప్రభావితం చూపుతాయి. నులిపురుగుల ఎక్కువగా ఉంటే ఆపరేషన్ చేయాల్సి ఉంటుంది. మలవిసర్జన, బహిర్భూమికి వెళ్లివచ్చాక కాళ్లు, చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. పాదాలకు బూట్లు తప్పనిసరిగా ధరించాలి. దీంతో పాటు ఆహార పదార్థాలను శుభ్రంగా కడగాలి. ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవాలి. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం వల్ల నులిపురుగులు రాకుండా నియంత్రించవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో పిల్లలకు, యువకులకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని వైద్యాధికారులు చెబుతున్నారు. దీంతో సంక్రమణాన్ని నియంత్రించడంతోపాటు శారీరక, మానసిక అభివృద్ధికి దోహదపడుతుందని సూచిస్తున్నారు. అయితే రెండేళ్లలోపు పిల్లలకు సగం మాత్ర, 3–19 ఏళ్ల వారికి ఒక మాత్ర వేయాలని వైద్యులు చెబుతున్నారు. మాత్రలు వేసే సమయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని పేర్కొంటున్నారు. వైద్యసిబ్బంది పర్యవేక్షణలో మాత్రమే వేయాలని సూచిస్తున్నారు.

'పోడు' పట్టాల లొల్లి!

సాగు భూమిని ఆక్రమించారంటూ గిరిజన రైతుల ఆందోళన

- అటవీశాఖ స్థలంలో చెట్లు తొలగించారని కేసుల నమోదు
- పాన్‌గల్ మండలం కిష్టాపూర్‌తండాలో ఘటన
- విచారణ జరిపి న్యాయం చేయాలని వేడుకోలు



పాన్‌గల్ అంబేడ్కర్ చౌరస్తాలో ఆందోళన చేస్తున్న గిరిజన రైతులు (ఫైల్)


పాన్‌గల్: తరతరాలుగా సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని ఏళ్లుగా అడుగుతున్నా పట్టించుకోకపోగా అటవీ అధికారులు భూములను అక్రమించి అక్రమ కేసులు నమోదు చేశారంటూ జిల్లాలోని పాన్‌గల్ మండలం కిష్టాపూర్‌తండా గిరిజన రైతులు ఆందోళన చేస్తున్నారు. వారి కథనం మేరకు.. గ్రామశివారులోని సర్వేనంబర్ 34లో 12 ఎకరాల పోడు భూమి ఉండగా సుమారు 50 ఏళ్లుగా 25 గిరిజన కుటుంబాలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయి. పనికిరాని భూములను సైతం చదును చేసి యోగ్యంగా మలుచుకోవడంతో పాటు ఆయా భూముల్లో బోర్లు వేసుకొని పంటలు సాగు చేసుకుంటున్నారు. అట్టి భూములకు గతంలో పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేసిన రెవెన్యూ అధికారులు ధరణి వచ్చిన తర్వాత కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వలేదు. బీఆర్‌ఎస్ హయాంలో ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో గిరిజన రైతులకు పోడు పట్టాలిచ్చినా ఇక్కడి రైతులకు మాత్రం పంపిణీ చేయలేదు. కాగా కొందరు రైతులు బతుకుదెరువు కోసం భూములు వదిలి ముంబై, పూణే వంటి నగరాలకు వలస వెళ్లగా అటవీశాఖ అధికారులు వారికి తెలియకుండా మొక్కలు నాటి ఆక్రమించే చర్యలు పూనుకున్నారని రైతులు చెబుతున్నారు. దీంతో చేసేది లేక భూమిలో ఉన్న చెట్లను ధ్వంసం చేయడంతో ఈ నెల 5న అటవీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో 12 మంది గిరిజన రైతులపై కేసులు నమోదయ్యాయి. తమపై అక్రమంగా నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలంటూ రైతులు గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సాగు చేసుకుంటున్న పోడు భూములపై సమగ్ర విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని.. లేనిచో ఆత్మహత్యే శరణ్యమని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అటవీ సంపద ధ్వంసం చేశారు..

అటవీశాఖ పరిధిలోని భూమిలో ఉన్న చెట్లను ధ్వంసం చేసి ప్రభుత్వ ఆస్తిని ఆక్రమించే ప్రయత్నం చేయడంతో జిల్లా అధికారుల ఆదేశానుసారం గిరిజన రైతులపై కేసులు నమోదు చేశాం. రైతులు సాగు చేయని అటవీ భూముల్లో ఉపాధిహామీ పథకంలో నాటిన మొక్కలను కూడా తొలగించారు. వారి వద్ద ఉన్న ఆధారాలతో జిల్లా అధికారులను కలిసి భూములకు హద్దులు ఏర్పాటు చేసుకోవాలి. కానీ అటవీ భూమిలోని చెట్లను ధ్వంసం చేయడం, అక్రమించడం నేరమే అవుతుంది.

– బాలకిష్టమ్మ, డిప్యూటీ రేంజ్ అధికారి, ఖాసీంనగర్ సెక్షన్, వనపర్తి

మాకు భూమే ఆధారం..



మేము ఎన్నో సంవత్సరాల క్రితం బీడు భూములను మంచిగా చేసి సాగుకు అనువుగా మార్చుకున్నాం. అందులో బోర్లు కూడా వేసుకున్నాం. మాకు ఈ భూమి తప్ప వేరే భూమి లేదు, ఇదే ఆధారం. కొంత కాలం పాటు ఇతర ప్రాంతాలకు వలస వెళ్తితే అందులో అటవీ శాఖ అధికారులు మొక్కలు నాటి అవి అటవీశాఖకు చెందినవిగా చిత్రీకరిస్తున్నారు. కేసులకు భయపడేది లేదు. భూమి దక్కే వరకు పోరాడుతాం. – బొజ్జమ్మ, మహిళా రైతు, కిష్టాపూర్‌తండా

శాస్త్రీయ విద్యా విధానాన్ని అమలు చేయాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ప్రైవేటు విద్యా వ్యవస్థను రద్దు చేసి శాస్త్రీయ విద్యా విధానాన్ని అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల్ నర్సింహ అన్నారు. స్థానిక సురవరం వెంకటరామిరెడ్డి భవన్‌లో ఆదివారం ఏఐఎస్ఎఫ్ 90వ వ్యవస్థాపక దినోత్సవాలను పురస్కరించుకొని ఉద్యమ యాదిలో గాయని రచయిత శ్యామల రూపొందించిన వీడియో ఆల్బమ్ సీడీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య వ్యాపార ధోరణితో పేదలకు అందని ద్రాక్షగా మారిందన్నారు. మోదీ ప్రభుత్వంలో కార్పొరేట్ శక్తులు విద్యను లాభాపేక్షగా మార్చడంతో పాటు కాషాయీకరణను పెంచి పోషిస్తున్నారని మండిపడ్డారు. శాస్త్రీయ విద్యా విధానం ద్వారానే అంధ, మూఢ విశ్వాసాలు తొలగుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బాలకిషన్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజు, జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ ఉన్నారు.

కేఎల్ఐ కాల్వకు గండి



వెల్దండ: మండలంలోని లక్ష్మాపూర్ చెరువు కట్ట సమీపంలో ఉన్న కేఎల్ఐ డీ–82 కాల్వకు ఆదివారం గండి పడింది. రెండు రోజుల క్రితం కేఎల్ఐ కాల్వ ద్వారా వెల్దండ శివారు వరకు సాగునీరు చేరింది. అయితే కాల్వలో నీటి ప్రవాహం అధికం కావడంతో కోతకు గురై నీరంతా వృథాగా పారింది. కేఎల్ఐ నుంచి సాగునీరు వచ్చే సమయంలో కాల్వకు గండి పడటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రతి ఏటా డీ–82 కాల్వ కోతకు గురవుతుండటంతో సాగునీటి కోసం కష్టాలు పడుతున్నామని వాపోతున్నారు. గతేడాది పంటలకు సకాలంలో నీరందక ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాల్వలకు సరైన మరమ్మతులు లేకపోవడంతోనే ఈ దుస్థితి నెలకొందని అంటున్నారు. బ్రిడ్జిల వద్ద కాల్వకు లైనింగ్ నిర్మిస్తేనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరుతున్నారు.

రామన్‌పాడుకు కొనసాగుతున్న వరద

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయానికి ఆదివారం శంకరసముద్రం నుంచి 1,500 క్యూసెక్కులు, ఊకచెట్టు వాగు నుంచి 300 క్యూసెక్కుల వరద చేరుతున్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. దీంతో రెండు గేట్లు పైకెత్తి 1,800 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశామన్నారు. జలాశయంలో పూర్తి స్థాయి నీటిమట్టం 1,021 అడుగులు ఉండగా.. ఎన్టీఆర్ కాల్వకు 875 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 55 క్యూసెక్కులు, వివిధ ఎత్తిపోతల పథకాలకు 75 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు వివరించారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజారోగ్యానికి భరోసా



అచ్చంపేట ఏరియా ఆస్పత్రిలో మెగా సర్జికల్ క్యాంపు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట: నల్లమల ప్రాంతంలో పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకే మెగా హెల్త్, సర్జికల్ క్యాంపు ఏర్పాటుచేసినట్లు ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. ఆదివారం అచ్చంపేట ఏరియా అస్పత్రిలో మూడో విడత మెగా హెల్త్, సర్జికల్ క్యాంపు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలకు మెరుగైన వైద్యం ఉచితంగా అందించడమే తన ప్రథమ కర్తవ్యమన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అచ్చంపేటలో మెగా సర్జికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ క్యాంపులో 570మంది పేర్లు నమోదు చేసుకున్నారని.. వీరందరికీ విడతల వారీగా సర్జరీలు చేస్తామన్నారు. ఏరియా ఆస్పత్రిలో అన్ని రకాల వసతులు సమకూర్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ అవసరమైన క్యాడర్ స్టెంత్, బ్లడ్‌బ్యాంక్, సెంట్రల్ ఆక్సిజన్, పారా మెడికల్ సిబ్బంది, డాక్టర్లను నియమిస్తామన్నారు. గత రెండు విడతల్లో ప్రభుత్వ పరంగా మెడికల్ సర్జికల్ క్యాంపులను విజయవంతంగా నిర్వహించి.. ఎంతో మంది రోగులకు శాశ్వత చికిత్సలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ రవినాయక్, సూపరింటెండెంట్ ప్రభు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.తారాసింగ్ ఆర్ఎంఓ ప్రదీప్‌రాజ్, డా.మహేశ్, డా.పగడాల శ్రీనివాస్, డా.బిక్కులాల్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి అథ్లెట్ల ఎంపిక పోటీలు



ఎంపిక పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం జిల్లాస్థాయి అథ్లెట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. అండర్–14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించగా.. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన 150 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముందుగా డీసీహెచ్ రమేశ్‌చంద్ర క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 30, 31 తేదీల్లో పాలమూరు యూనివర్సిటీలోని సింథటిక్ మైదానంలో నిర్వహించే 11వ రాష్ట్ర జూనియర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి స్వాములు, సంయుక్త కార్యదర్శి పరుశురాం, భిక్షపతి, నిర్మల, సుభాషిణి, బాలశ్రీ, జ్యోతి, బాలు, బాలయ్య, రాణా, రాజేందర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పిడుగుపాటుతో పది మందికి గాయాలు

మల్దకల్: పిడుగుపాటుతో పది మందికి గాయాలైన ఘటన మల్దకల్ మండలంలోని పెద్దొడ్డి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలిలా.. పెద్దొడ్డి గ్రామానికి నల్లారెడ్డి చేనితోటలో అయిజకు చెందిన కూలీలు చరణ్, విజయ్, భీమేష్, మల్లయ్య, రఫి, తిమ్మోజీ, రమేష్ పండ్లు కోసే పనిలో నిమగ్నమయ్యారు. వీరికి సమీపంలోని మరో పొలంలో లక్ష్మి, శ్రీకాంత్, సుజాత వ్యవసాయ పనులు చేస్తున్నారు. ఈక్రమంలో ఒక్కసారిగా రెండుచోట్ల రెండు పిడుగులు పడడంతో పది మంది కూలీలు గాయపడ్డారు. స్థానికులు వారిని వెంటనే చికిత్స నిమిత్తం 108లో గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎవరికి ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఝాన్సీరాణి సంఘటన జరిగిన ప్రదేశానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు.

మిడ్జిల్‌లో వృద్ధుడి బలవన్మరణం

మిడ్జిల్: మండల కేంద్రానికి చెందిన తుప్పుడ బాలయ్య (65) ఇంట్లోనే ఉరి వేసుకోని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు.. గ్రామానికి చెందిన తుప్పుడ బాలయ్య భార్య కొన్నేళ్ల క్రితం చనిపోయింది. ఇద్దరు కుమారులు ఉన్నా.. వారు వేరు, వేరుగా ఉంటుండడంతో ఒక్కడే ఒంటరిగా నివసిస్తున్నాడు. ఈ క్రమంలో ఏడాది నుంచి తీవ్ర అనారోగ్యం పాలవడంతో మనస్తాపానికి గురై శనివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకోగా ఆదివారం తెల్లవారుజామున ఇంటి పక్కల వార గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే ఆయన మృతి చెందాడు. ఘటనపై ఎస్‌ఐ శివ నాగేశ్వర్‌నాయుడు మాట్లాడుతూ తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాన్‌గల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరంగాపూర్ మండలంలోని నాగరాల–2కు చెందిన పాటమిని నర్సింహ(46), భార్య రాములమ్మతో కలిసి ఈ నెల 9న బైక్‌పై శ్రీరంగాపూర్ మండల కేంద్రానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి వెళ్తుండగా రాయినిపల్లి సమీపంలో బొలెరో వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడడంతో వారిని అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ గొల్ల నర్సింహ ఆదివారం మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన బొలెరో వాహన డ్రైవర్ కొమారి రాముడుపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ మృతుడి బావమరి శ్రీశైలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు హెచ్‌సీ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు.

ఏదుట్లలో మరో వ్యక్తి మృతి

గోపాల్‌పేట: మండలంలోని ఏదుట్లకు చెందిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి చెందిన బుద్దుల నాగేశ్వి (32) తాగుడుకు బానిసయ్యాడు. తాగేందుకు డబ్బులు కావాలని గత నెల 30న భార్య భాగ్యలక్ష్మి, తల్లిని అడిగాడు. లేవని చెప్పడంతో క్షణికావేశంలో ఇంట్లో ఉన్న పురుగుమందు తాగగా కాసేపటికి గుర్తించిన భార్య వెంటనే వనపర్తి ఆస్పత్రికి అటు నుంచి మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ఆదివారం భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

యువకుడి మృతి


సురేష్‌గౌడ్ (ఫైల్)

శాంతినగర్: ఆర్థిక ఇబ్బందులతో గడ్డిమందు తాగిన ఓ యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందిన ఘటన వడ్డేపల్లి మండలం కొంకలలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన సురేష్‌గౌడ్ (20) జూలై 12న గడ్డిమందు తాగాడు. గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం రాయచూర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.

పాలమూరుకు సాగునీరు

మహబూబ్‌నగర్ ప్రజల నీటి కష్టాలు తీర్చనున్న కోయిల్‌సాగర్

ఒకప్పుడు నీటి ఎద్దడితో అల్లాడుతున్న మహబూబ్‌నగర్ నియోజకవర్గ ప్రజలకు తాగునీరు అందించిన కోయిల్‌సాగర్ ప్రాజెక్టు.. ఇప్పుడు సాగునీటి అవసరాలు సైతం తీర్చనుంది. కొండాపూర్ వద్ద కొత్తగా లిఫ్ట్ ఏర్పాటు చేసి కోయిల్‌సాగర్ నుంచి నీటిని ఎత్తిపోయనున్నారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని 25 చెరువులను నీటితో నింపి వేల ఎకరాలకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో పనులు షరవేగంగా కొనసాగుతున్నాయి.


కోయిలకొండ మండలం పెర్కివీడులో సర్వేను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

- కొండాపూర్ వద్ద లిఫ్ట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు
- మనికొండ మీదుగా 25 చెరువులను నీటితో నింపేందుకు చర్యలు
- జిల్లా రైతులకు తీరనున్న సాగునీటి కష్టాలు

మహబూబ్‌నగర్ రూరల్: జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టు కోయిల్‌సాగర్ నుంచి పాలమూరుకు సాగునీరు అందబోతుంది. ఇందుకు సర్వే కూడా దాదాపు పూర్తయింది. కోయిల్‌సాగర్ నుంచి కొండాపూర్ వద్ద లిఫ్ట్ ఏర్పాటు చేసి కేశ్వాపూర్, మనికొండ మీదుగా మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని 25 చెరువులను నీటితో నింపనున్నారు. ఈ పనులు పూర్తయితే రైతులకు సాగునీటి కష్టాలు తీరనున్నాయి.

5వేల ఎకరాలకు..

జిల్లాలో ఏకైక సాగునీటి వనరు అయిన కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా జిల్లాకు సాగునీరు అందించే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి పెద్దగా సాగునీటి ప్రాజెక్టులు లేవు. దీంతో కోయిల్‌సాగర్ నుంచి నీటిని లిఫ్ట్ చేసి రూరల్ మండలానికి అందించవచ్చనే ఉద్దేశంతో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఈ మేరకు ప్రతిపాదించారు. కోయిల్‌సాగర్ రిజర్వాయర్ దేవరకద్ర నియోజకవర్గ పరిధిలో ఉంది. ఈ రిజర్వాయర్ కింద లిఫ్ట్ ద్వారా మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని 25 చెరువులను నింపి వాటి పరిధిలో 5వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ప్రతిపాదనలకు మంత్రి సానుకూలంగా స్పందించి ఆ దిశగా పనులు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. జూరాల బ్యాక్ వాటర్‌తో రన్ అవుతున్న కోయిల్‌సాగర్ రిజర్వాయర్ ద్వారా కొత్తగా లిఫ్ట్ ఏర్పాటు చేసి సమీప చెరువులను నింపి సాగునీరు ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించి ఇరిగేషన్ అధికారులు చెరువుల గుర్తింపు పనిలో నిమగ్నమై సర్వే చేస్తున్నారు.


నూతన లిఫ్ట్‌తో నీటిని నింపనున్న వెంకటాయిపల్లి బాపన్‌కుంట మ్యాప్

పాలమూరు- రంగారెడ్డి ద్వారా..

దీంతోపాటు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా మహబూబ్‌నగర్ జిల్లాకు సాగునీరు అందించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కర్వెన రిజర్వాయర్ కింద మహబూబ్‌నగర్ రూరల్ మండలంలో 9,750 ఎకరాలు, హన్వాడ మండలంలోని 14,852 ఎకరాలకు సాగునీరు అందించే ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయి. కర్వెన కెనాల్ ద్వారా మహబూబ్‌నగర్ రూరల్ మండలానికి, ఉదండాపూర్ రిజర్వాయర్ ద్వారా హన్వాడ మండలానికి సాగునీరు అందించనున్నారు.

కొండాపూర్ వద్ద లిఫ్ట్ ఏర్పాటు

ఒకప్పుడు నీటి ఎద్దడితో అల్లాడుతున్న మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి తాగునీటి అవసరం తీర్చిన కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకం ఇప్పుడు సాగునీటి అవసరాలు తీర్చనుంది. కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా కొండాపూర్ వద్ద లిఫ్ట్ ఏర్పాటు చేసి రూరల్ మండలంలోని 25 చెరువులకు సాగునీరు పారించనున్నారు. చౌదర్‌పల్లి, బొక్కలోనిపల్లి, మనికొండ, రామచంద్రాపూర్, మాచన్‌పల్లి, కోటకదిర, పోతన్‌పల్లి, దేవరకద్ర మండలంలోని వెంకటాయపల్లి గ్రామాల చెరువులను కోయిల్‌సాగర్ బ్యాక్ వాటర్‌తో నింపనున్నారు. ఎనిమిది గ్రామాలను కలుపుతూ ఈ చెరువులు ఉండటంతో దాదాపు 5 వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉంది. దీంతో యాసంగి పంటలకు సాగునీటి ఇబ్బందులు తప్పే అవకాశం ఉంది.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు..



కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని పొలాలకు సాగునీరు అందిస్తాం. సుమారు 25 చెరువులను నింపి ఐదువేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సంకల్పించారు. ఆ మేరకు సర్వే కూడా పూర్తయింది. మరో పది రోజుల్లో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించి నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తున్నారు. ఈ పనులు పూర్తయితే మండల రైతులకు సాగునీటి కష్టాలు తీరనున్నాయి. – మల్లు నర్సింహారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

సర్వే పూర్తయింది



కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా మహబూబ్‌నగర్ రూరల్ మండలంలో సుమారు 5 వేల ఎకరాలకు సాగునీరు అందించాలనే ప్రతిపాదనల మేరకు సర్వే చేయించాం. కొండాపూర్ వద్ద లిఫ్ట్ ఏర్పాటు చేసి మనికొండ మీదుగా కెనాల్ ద్వారా చెరువులను నింపుతాం. తద్వారా భూగర్భ జలమట్టం పెరగడంతో పాటు పంటల సాగుకు పుష్కలంగా నీరు అందనుంది. – మనోహర్, డీఈ, చిన్ననీటి పారుదల శాఖ

పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా సైకిల్ యాత్ర


సైకిల్‌యాత్రలో భాగంగా చారకొండకు చేరుకున్న యువకుడు కార్తిక్‌రెడ్డి

చారకొండ: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఏపీ రాష్ట్రం కడప జిల్లా మైదుకూరు మండలం బస్వాపూర్‌కు చెందిన యువకుడు కార్తిక్‌రెడ్డి సైకిల్ యాత్ర చేపట్టారు. ఫిబ్రవరి 6న స్వగ్రామం నుంచి సేవ్ ట్రీ.. సేవ్ లైఫ్ అనే నినాదంతో సైకిల్ యాత్ర చేపట్టగా.. ఆదివారం చారకొండ మండలానికి చేరుకున్నాడు. ఈసందర్భంగా కార్తిక్‌రెడ్డి మట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు అందరం కృషి చేయాలన్నారు. పర్యావరణం ఎందుకు, ఎలా దెబ్బ తింటుంది, ఎలా సంరక్షించుకోవాలి తదితర అంశాలపై స్థానిక యువకులతో చర్చించారు. మానవాళి మనుగడకు చెట్లు చాలా అవసరమని వాటి ప్రాధాన్యతపై వివరించారు. ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, గోవా, ఒడిశా రాష్ట్రాల మీదుగా దాదాపు 4200 కి.మీ సైకిల్‌యాత్ర పూర్తి చేశానని, మిగతా రాష్ట్రాల్లో తిరిగి ప్రజల్లో చైతన్యం కల్గించి యాత్ర ముగిస్తానని తెలిపారు. అనంతరం చారకొండ నుంచి దేవరకొండకు బయల్దేరారు.

రెండు కార్లు ఢీ

- అన్నకు రాఖీ కట్టి వెళ్తుండగా ప్రమాదానికి గురైన చెల్లెల్లు
- క్షతగాత్రుల్లో నలుగురిది ఒకే కుటుంబం

అడ్డాకుల: మూసాపేట మండలంలోని వేముల స్టేజీ వద్ద ఆదివారం రెండు కార్లు ఢీకొట్టుకోవడంతో రోడ్డుపై బస్సుల కోసం వేచి చూస్తున్న ఐదుగురికి గాయాలయ్యాయి. స్థానికులు, బాధితుల వివరాల ప్రకారం.. వేముల స్టేజీ వద్ద అండర్ బ్రిడ్జీ పనులు జరుగుతుండడంతో తాళ్లగడ్డ వైపు నుంచి వచ్చిన కారు వేముల వైపు వెళ్తూ కర్నూల్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారును ఢీకొట్టింది. కారు రోడ్డు పక్కన బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులపైకి దూసుకెళ్లి సర్వీస్ రోడ్డు కోసం తీసిన కాల్వలో ఆగింది. ప్రమాదంలో వేములకు చెందిన గిర్ని నాగమణి, కోయిలకొండ మండలంలోని కేశాపూర్‌కు చెందిన యాదమ్మ, వేములకు చెందిన సరిత, సంధ్య, శ్రీశైలం గాయపడ్డారు. నాగమణి తలకు తీవ్ర గాయాలు కాగా.. శ్రీశైలం, సంధ్యకు కాళ్లు విరిగినట్లు బంధువులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారును వదిలేసి డ్రైవర్ పారిపోయినట్లు స్థానికులు తెలిపారు.

రాఖీ కట్టి వెళ్తుండగా..

వేములకు చెందిన యాదయ్యకు ఇద్దరు చెల్లెల్లు. కోయిలకొండ మండలంలోని కేశాపూర్‌కు చెందిన యాదమ్మ, వేములలోనే ఉండే ఆమె చెల్లెలు గిర్ని నాగమణిలు శనివారం వేములలో అన్న యాదయ్యకు రాఖీ కట్టారు. మరో తమ్ముడు కృష్ణయ్య హైదరాబాద్‌లో ఉంటుండగా అక్కడికి వెళ్లడానికి ఆదివారం వేముల స్టేజీ వద్ద హైదరాబాద్ బస్సుల కోసం నాగమణి, యాదమ్మ, వారి అన్న యాదయ్య కుమార్తెలు సరిత, సంధ్య 44వ నంబర్ జాతీయ రహదారిపై వేచి ఉన్నారు. అదే సమయంలో వేములకు చెందిన ఉన్ని శ్రీశైలం అక్కడికి వచ్చి వారిని పలకరిస్తుండగా కారు వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఐదుగురు గాయపడ్డారు. ఇందులో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు తీవ్రంగా గాయపడటంతో వేములలో విషాదం అలుముకుంది. ఇదిలా ఉండగా శనివారం వేముల గ్రామానికి చెందిన రైతు సంగు వెంకటయ్య ఘటనకు కొంత దూరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ రెండు సంఘటనలు గ్రామస్తులను కలచి వేశాయి. నిర్లక్ష్యపు పనులతోనే ఇక్కడ నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సరైన రక్షణ చర్యలు చేపట్టకుండా పనులు చేస్తుండటంతో ప్రమాదాలు పెరుగుతున్నాయని ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు.

ముగ్గురు అర్చకులకు నోటీసులు

అలంపూర్: అలంపూర్ క్షేత్రంలో విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురు అర్చకులకు నోటీసులు జారీ చేసినట్లు ఆలయ ఈఓ పురేందర్ కుమార్ ఆదివారం తెలిపారు. జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న అర్చకులు ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యారని, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముగ్గురు అర్చకులకు నోటీసులు జారీ చేసినట్లు ఈఓ పేర్కొన్నారు.

పందెంరాయుళ్ల అరెస్టు

గద్వాల క్రైం: ఆటవిడుపుగా ఆడే బొమ్మ బొరుసుపై కూడా కొందరు గుట్టుగా పందెం కాస్తున్నారు. రూ. 10నుంచి మొదలుకొని రూ. 300 వరకు పందెం కాస్తున్న స్థావరంపై ఆదివారం పోలీసులు మెరుపు దాడులు చేశారు. ఎస్‌ఐ శ్రీకాంత్ వివరాల మేరకు.. గద్వాల మండలం పూడూరు గ్రామశివారులో కొందరు గుట్టుగా బొమ్మ బొరుసుపై పందెం వేసుకుంటున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడులుచేసి.. 8మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 7 సెల్‌ఫోన్స్, రూ. 7,100 నగదు, 21 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. దాడులు చేపట్టిన క్రమంలో 13మంది తప్పించుకున్నారన్నారు. వీరిపై గేమింగ్ యాక్టు కింద కేసులు నమోదు చేశామన్నారు. తప్పించుకున్న వారిని సైతం త్వరలోనే అదుపులోకి తీసుకుని చట్టపరమైన చర్యలు తీసకుంటామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

లైన్‌మెన్ మృతి

బిజినేపల్లి: మంగనూర్ సబ్‌స్టేషన్‌లో లైన్‌మెన్‌గా పని చేస్తున్న రాము(40) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. గత సోమవారం రాత్రి ఆయన విధులు ముగించుకుని మంగనూర్ నుంచి మహబుబ్‌నగర్‌కు వెళ్తుండగా.. ఆ గ్రామ శివారులో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. రాముకు తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా ఆదివారం మృతి చెందాడు. మృతుడు స్వగ్రామం తాడూర్ మండలంలోని సిర్సవాడ. రాము మృతిపై విద్యుత్ ఉద్యోగులు సంతాపం తెలిపారు.

జూరాలకు 90 వేల క్యూసెక్కుల వరద

8 క్రస్ట్ గేట్లు పైకెత్తి దిగువకు నీటి విడుదల


జూరాల జలాశయం నుంచి దిగువకు పారుతున్న వరద

ధరూరు: ప్రియదర్శిని జూరాల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద ఆదివారం తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం రాత్రి 8 గంటల సమయంలో 1.15 లక్షల క్యూసెక్కులు ఉండగా.. ఆదివారం సాయంత్రం 6.30 సమయంలో 90 వేల క్యూసెక్కులకు చేరినట్లు చెప్పారు. దీంతో 8 క్రస్ట్ గేట్లు పైకెత్తి 52,758 క్యూసెక్కులు దిగువకు వదిలామన్నారు. అలాగే విద్యుదుత్పత్తి నిమిత్తం 32,399 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315, ఆవిరి రూపంలో 47, కుడి కాల్వకు 470, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు వివరించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.531 టీఎంసీల నీటినిల్వ ఉన్నట్లు తెలిపారు.

విద్యుదుత్పత్తి వేగవంతం..

ఆత్మకూర్: జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి నిరంతరాయంగా కొనసాగుతోంది. ఎగువన 5 యూనిట్ల నుంచి 195 మెగావాట్లు, 208.889 మి.యూ, దిగువన 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 248.715 మి.యూ. విద్యుదుత్పత్తి చేపడుతున్నామని ఎస్‌ఈ శ్రీధర్ వివరించారు. ఎగువ, దిగువ కేంద్రాల్లో ఇప్పటి వరకు 457.604 మి.యూ. విద్యుదుత్పత్తి విజయవంతంగా చేపట్టామని తెలిపారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 32 వేల క్యూసెక్కులు వినియోగించినట్లు చెప్పారు

శ్రీశైలం జలాశయానికి..

దోమలపెంట: శ్రీశైలం జలాశయానికి ఆదివారం జూరాల ఆనకట్ట స్పిల్‌వే ద్వారా 52,758 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 32,399 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 66,176 క్యూసెక్కుల వరద చేరింది. శ్రీశైలం భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 32,399 క్యూసెక్కులు నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. ప్రస్తుతం జలాశయంలో 880.6 అడుగుల నీటిమట్టం.. 191.2118 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడుకు 32 వేల క్యూసెక్కులు, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఎత్తిపోతలకు 2,818, ఎంజీకేఎల్‌ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 16.232 మి.యూ., కుడిగట్టు కేంద్రంలో 14.741 మి.యూ. విద్యుదుత్పత్తి చేపట్టారు.

చిక్కని చిరుత

- రెస్క్యూ బృందాలకు సవాల్
- నిపుణుల సహకారం తీసుకున్నా ఫలితం శూన్యం
- భయాందోళనలో పట్టణవాసులు


ఆదివారం తెల్లవారుజామున దంపింగ్‌యార్డు వైపు వెళ్తూ ట్రాప్ కెమెరాకు చిక్కిన చిరుత

మహబూబ్‌నగర్ న్యూటౌన్: హైదరాబాద్ నుంచి రప్పించిన రెస్క్యూ టీం, అటవీ, పోలీసు బృందాలు నిరంతరాయంగా శ్రమిస్తున్నా చిరుత బోనుకు చిక్కడం లేదు. మహబూబ్‌నగర్ పట్టణానికి అతి సమీపంలోని తిర్మల్‌దేవునిగుట్ట, డంపింగ్ యార్డుల్లో కలియ తిరుగుతూ పరిసర ప్రాంతాల ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. రెస్క్యూ బృందం చిరుతను పట్టుకునేందుకు 40 రోజులుగా తమదైన శైలిలో ప్రయత్నిస్తున్నా వారి కళ్లుగప్పి మరో చోట మెరుపులా కనిపిస్తూ దడ పుట్టిస్తోంది. స్వయంగా కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ డి.జానకి చిరుత సంచరిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. చిరుతను పట్టుకొని అటవీ ప్రాంతంలో వదిలేలా చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించడంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దీంతో సెర్చ్ బృందాలు ఎప్పటికప్పుడు చిరుత కదలికలను పర్యవేక్షిస్తూ పట్టుకునేందుకు తమదైన శైలిలో ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. అయినా ఫలితం లేకపోవడంతో చిరుతను పట్టుకునేదెలా అనే అయోమయంలో పడ్డాయి.

దట్టమైన పొదలు, రాళ్ల మధ్య..

టీడీగుట్ట, స్మశానవాటిక ఏరియాల్లో దట్టమైన చెట్ల పొదలు, పెద్ద పెద్ద రాళ్ల మధ్య గుహలే చిరుతను పట్టుకునేందుకు అడ్డంకిగా మారాయి. స్మశానవాటిక, టీడీగుట్ట ప్రాంతాల్లో చిరుతకు ఆహారం దొరకని సమయంలో పరిసర ప్రాంతాల్లోకి వచ్చి కుక్కలను పట్టుకొని వెళ్తుందని అటవీశాఖ అధికారుల అంచనా. ఏదైనా ఆహారం దొరికిన సమయంలో కనీసం మూడు రోజులు బయటికి రాకుండా ఉంటుంది. ఆ తర్వాత ఆహారం కోసం సంచరిస్తున్న సమయంలో అక్కడక్కడా ట్రాప్ కెమెరాలకు చిక్కుతోంది. దీంతో అప్రమత్తమైన అధికారులు మరింతగా సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నా చిక్కడం లేదు.

5 డ్రోన్లు, 20 ట్రాప్ కెమెరాలు, 4 బోన్లు

చిరుతను పట్టుకునేందుకు ఆయా ప్రాంతాల్లో 4 బోన్లు ఏర్పాటుచేశారు. చిరుత సంచరిస్తున్న దారుల్లో 20 ట్రాప్ కెమెరాలు ఏర్పాటుచేసి కదలికలను గమనిస్తున్నారు. అంతే కాకుండా 4 డ్రోన్ కెమెరాలతో పై నుంచి చిరుత కదలికలను పర్యవేక్షిస్తున్నారు. దట్టమైన పొదలు, చెట్లు, రాళ్ల ఉండటం కారణంగా డ్రోన్ కెమెరాలకు చిరుత ఆనవాళ్లు ఏమాత్రం కనిపించడం లేదు. అయితే గుట్టపైనున్న గుండ్లపై ఎక్కి కిందకు దిగిన చిరుతను సమీప ప్రాంతాల ప్రజలు గమనించి అధికారులకు సమాచారం చేరవేస్తున్నా ఫలితం లేకుండా పోతోంది.

నిపుణుల సూచనల మేరకు..

భయాందోళకు గురిచేస్తున్న చిరుతను బంధించేందుకు ఎన్ని రకాల ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోవడంతో నిపుణుల సూచనల మేరకు సరికొత్త ఆలోచనలకు పదును పెట్టారు. చిరుత సంచరిస్తున్నా ప్రాంతాల్లో మేకలను చెట్టుకు కట్టి ఉంచడం, మత్తు ఇంజక్షన్లతో రెడీగా కాపలా కాయడం వంటి చర్యలు చేపడుతున్నారు. జిత్తులమారి చిరుతను పట్టుకునేందుకు అధికార యంత్రాంగం చేస్తున్న కృషి ఫలించాలని ఆశిద్దాం.

నిరంతర పర్యవేక్షణ..

చిరుత సంచారంపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోంది. అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచనలు చేస్తూనే ఉన్నాం. బోన్లు ఏర్పాటు చేసి ట్రాప్ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నాం. నిపుణుల సూచనలు అమలు చేస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మూడు షిఫ్టులుగా అటవీ బృందాలు పనిచేస్తున్నాయి. – కమాలుద్దీన్, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్

ఒకే ఈతలో రెండు దూడలు



మద్దూరులోని తలారి వెంకట్రాములుకు చెందిన ఆవు ఆదివారం రెండు దూడలకు జన్మనిచ్చింది. ఆవు ఒకే ఈతలో రెండు దూడలను ఈనడంతో రైతు ఆనందం వ్యక్తం చేశారు. ఈ విషయమై పశువైద్యాధికారి సబిత మాట్లాడుతూ ఆవులు చాలా అరుదుగా రెండు దూడలకు జన్మనిస్తాయని పేర్కొన్నారు. దూడలు ఆరోగ్యంగా ఉంటే ఎలాంటి సమస్య ఉండదన్నారు. – మద్దూరు

సాక్షి క్లాసిఫైడ్స్
SERVICES
BUSINESS OFFER
■ అరేంజ్ ద బ్యాంక్ గ్యారెంటీ బిల్డర్స్ రియల్టర్స్ స్క్రైపర్ టవర్స్ కన్‌స్ట్రక్షన్స్, డైమండ్స్, జ్యూవెలరీ, బిజినెస్, కోల్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్స్ ఫార్మర్స్. 9849161889

సాక్షి
పుట్టిన రోజు
తెలియజేయండి
రూ. 500/-
HAPPY BIRTHDAY

గమనిక

లాంచీలో షికారు చేసి వస్తున్న పర్యాటకులు



స్కూటర్ బోటులో షికారు చేస్తూ..



కృష్ణమ్మ అందాలను తిలకిస్తూ..



నదీ తీరంలో సెల్ఫీ దిగుతూ..



పర్యాటకుల సందడి

పర్యాటక ప్రాంతమైన సోమశిలలో ఆదివారం పర్యాటకుల సందడి కనిపించింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన పర్యాటకులు బోట్లలో షికారు చేస్తూ కృష్ణానది అందాలను తిలకించారు. అనంతరం పుష్కరఘాట్ల వద్ద నదీ స్నానం ఆచరించి.. లలితాంబికా సోమేశ్వరాలయాన్ని దర్శించుకున్నారు. పర్యాటకుల సందడితో నదీ తీరం కనువిందుగా మారింది. – కొల్లాపూర్